క్లుప్తంగా

విధి నిర్వహణలో ఉద్యోగుల సేవలు మరువలేనివి



హోంగార్డును సన్మానిస్తున్న ఏఎస్పీ

జగిత్యాలక్రైం: విధి నిర్వహణలో ఉద్యోగుల సేవలు మరువలేనివని జిల్లా అడిషనల్ ఎస్పీ భీంరావు అన్నారు. పదవీ విరమణ పొందిన హోంగార్డు రామస్వామిని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సన్మానించారు. ప్రతి ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పదన్నారు. విజయవంతంగా సర్వీస్ పూర్తి చేసిన వారి సేవలను పోలీసు శాఖ ఎప్పుడూ మరువదన్నారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ సైదులు, ఆర్ఎస్సై సుమన్ పాల్గొన్నారు.

యూరియా కొరత అవాస్తవం



రికార్డులు పరిశీలిస్తున్న ఏవో

మెట్‌పల్లిరూరల్: యూరియా కొరత ఉందంటూ జరిగిన ప్రచారంలో నిజంలేదని అది పూర్తిగా అవాస్తమని మెట్‌పల్లి మండల వ్యవసాయ అధికారి దీపిక అన్నారు. మెట్‌పల్లి సొసైటీ పరిధిలోని వెల్లులలో గోదాంను శనివారం సందర్శించి యూరియా నిల్వలు,రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడారు. సొసైటీ పరిధిలో 2025–26 వానకాలం సీజన్‌కు గాను మొత్తం 427.815 మెట్రిక్ టన్నుల యూరియా అవసరముంటుదని అంచనా వేశామన్నారు.ఇప్పటివరకు 40 మెట్రిక్ టన్నుల యూరియా తెప్పించామని,గడిచిన పదిరోజుల్లో 17.1 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఈవో ప్రవీణ్,తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన బీజేపీ నాయకులు



ఎంపీ అర్వింద్‌తో శ్రీనివాస్‌రెడ్డి

మల్లాపూర్: నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌ను శనివారం బీజేపీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు కలిశారు. నిజామాబాద్‌లో ఎంపీ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు కావడం లేదని, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని నాయకులకు ఎంపీ సూచించారు. బీజేవైఎం మండల అధ్యక్షుడు పందిరి నాగరాజు, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు లవంగ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


వికసిత్ భారత్ దిశగా మోదీ పాలన



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మల్యాల: పదకొండేళ్ల మోదీ పాలన వికసిత్ భారత్ దిశగా సాగుతోందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వాసుదేవ రెడ్డి, బింగి వేణు అన్నారు. మండల కేంద్రంలో బీజేపీ పిలుపు మేరకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ 11 ఏళ్ల ప్రభుత్వం– సంకల్పం సాకారం పేరిట సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ 11 ఏళ్ల పాలనలో భారతదేశ వైభవాన్ని విశ్వవేదికపై నిలబెట్టిందన్నారు. కార్యక్రమంలో గాజుల మల్లేశం, కొల్లూరి గంగాధర్, రవి, రమేశ్,వెంకటస్వామి, శ్రవణ్‌కుమార్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెగడపల్లి ఎస్సైగా కిరణ్‌కుమార్



పెగడపల్లి: పెగడపల్లి పోలీస్ ఎస్సైగా కిరణ్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా పని చేసిన రవికిరణ్ ఇటీవల సస్పెన్షన్‌కు గురికాగా, ఇక్కడ ఎస్సై పోస్టు ఖాళీగా ఉంటుంది. జగిత్యాల టౌన్ ఎస్సైగా ఉన్న కిరణ్‌కుమార్‌ను ఇక్కడ నియమిస్తూ ఎస్పీ అశోక్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్సైకి పోలీస్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

అంగన్‌వాడీల బలోపేతానికి చర్యలు

- ఉద్యోగ విరమణ బెనిఫిట్స్ పెంపుతో సిబ్బంది హర్షం
- జిల్లాలో 1065 అంగన్‌వాడీ టీచర్లు, 1065 మంది హెల్పర్లకు ప్రయోజనం



అంగన్‌వాడీ సిబ్బంది

పెగడపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఈ ఏడాది నుంచి వేసవిలో సిబ్బందికి సెలువులు ఇవ్వడమే కాకుండా అంగన్‌వాడీ వ్యవస్థ ఏర్పాటు నుంచి మొదటిసారిగా 'టేక్ హోం రేషన్'కు అనుమతినిచ్చింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో ఎండ నుంచి ఉపశమనం లభించడంతో సిబ్బందిలో హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలోనూ వేసవిలో సెలవులు ఇచ్చినా టీచర్, హెల్పర్ పదిహేను రోజుల చొప్పున విధులు నిర్వహించి పౌష్టికాహారం వండి వడ్డించాల్సి వచ్చేది. ఈ సారి బియ్యం, పప్పు, వంటనూనే, గుడ్లు, పాలు, నెలకు సరిపడా ఒకేసారి ఇంటికే పంపిణీ చేసేందుకు అనుమతినిచ్చింది. తాజాగా అంగన్‌వాడీ టీచర్లు, హెలర్లకు పదవీవిరమణ వయస్సును 65 ఏళ్లకు, అలాగే రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌ను కూడా పెంచుతూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఇప్పటి వరకు అంగన్‌వాడీ టీచర్లకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ. లక్ష ఉండగా రూ. 2 లక్షలు, హెల్పర్లకు రూ. 50 వేలు ఉండగా రూ. లక్షకు పెంచింది. సిబ్బంది పదవీవిరమణ వయస్సు 65 ఏళ్లు కాగా వివిధ కారణాలతో 60 ఏళ్లు దాటినా తరువాత వీఆర్ఎస్ తీసుకునే అవకాశం కల్పిస్తూ రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌ను వర్తింపజేస్తూ ఉత్తర్వు జారీ చేసింది. జిల్లాలో జగిత్యాల, మెట్‌పల్లి, మల్యాల, ధర్మపురిలో నాలుగు ప్రాజెక్టులున్నాయి. దీంతో జిల్లా వ్యాప్తంగా 1065 మంది అంగన్‌వాడీ టీచర్లు, 1065 మంది హెల్పర్లకు ప్రయోజనం కలుగనుంది. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ పెంచాలని కొన్నేళ్లుగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన, ధర్నాలు చేపట్టి ప్రభుత్వాలపై ఒత్తిళ్లు తెచ్చిన ఫలితం నెరవేరడంతో అంగన్‌వాడీ సిబ్బంది సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ ఆదేశం మేరకు



అంగన్‌వాడీ వ్యవస్థ పటిష్ఠతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రభుత్వ నిబంధనల మేరకు ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటాం. జిల్లాలోని ఖాళీల వివరాలు ఇప్పటికే ఉన్నతాధికారులు, ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వ ఆదేశాలు మేరకు నడుచుకుంటాం.

– బోనగిరి నరేశ్ డీడబ్ల్యూవో

అస్తవ్యస్తంగా నందగిరి - అయితిపల్లి రోడ్డు



బురదమయంగా నందగిరి- అయితిపల్లి రోడ్డు

పెగడపల్లి: మండలంలోని నందగిరి నుంచి అయితిపల్లికి వెళ్లే అంతర్గత రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు. వర్షాకాలం నేపథ్యంలో చిన్నపాటి వర్షాలకే రహదారి బురదమయంగా మారి రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుపై పంట పొలాలకు వెళ్లే రైతులు, ప్రజలు భయభయంగా వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. సుమారు రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న ఈ దారిపై కంకర వేసి మట్టిపోసి బాగు చేసినట్లయితే ఇబ్బందులు తొలగిపోయే అవకాశం ఉంటుందని స్థానికులు సూచిస్తున్నారు. ఈ దిశగా అధికారులు, పాలకులు కృషి చేయాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

హెల్మెట్ రూల్.. పోలీసులకు కాదేమో..?



కోరుట్ల: పట్టణంలోని కల్లూర్‌రోడ్‌లో శుక్రవారం సాయంత్రం పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టి హెల్మెట్ లేని వారికి జరిమానాలు వేశారు. అదే సమయంలో ఆ పక్క నుంచే ఇద్దరు పోలీసులు ఓ ద్విచక్ర వాహనంపై హెల్మెట్ పెట్టుకోకుండా వెలుతున్నా.. పట్టించుకోలేదు. గమనించిన స్థానికులు పోలీసులకు మాత్రం హెల్మెట్ నిబంధన నుంచి మినహాయింపు ఉంటుందా..? అని చర్చించుకోవడం గమనార్హం.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్ వీధిలోని అభ్యాస స్కూల్ పక్కన విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇంటిపైకి వెళ్తే కరెంట్ షాక్ వచ్చే ప్రమాదం ఉందని, అధికారులు స్పందించి విద్యుత్ వైర్లు తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.





పడిపోయినా చిగురిస్తా..

సారంగాపూర్: సారంగాపూర్ అటవీప్రాంతంలోని బతుకమ్మ కుంట సమీపంలో ఓ మోతుకు (మోదుగు) వృక్షం గడచిన వేసవిలో భారీ ఈదురు గాలులకు కూకటి వేళ్లతో నేల కూలింది. దీంతో చెట్టు మోడువారిపోయి, పూర్తిగా ఎండలకు వేర్లతో సహ ఎండిపోయింది. దీనితో చాలా మంది గ్రామస్తులు ఎండిన చెట్టు నుంచి ఇంటి అవసరాల కోసం కొంత మేర కొట్టుకుపోయారు. అయినప్పటికీ ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలకు తిరిగి ఆకులు, కొత్త మండలతో మళ్లీ పచ్చబడి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

కాంగ్రెస్ ప్రభుత్వానివి దిగజారుడు రాజకీయాలు

కథలాపూర్: రాష్ట్రాన్ని పాలించడం చేతకాక కాంగ్రెస్ ప్రభుత్వం దిగజారుడు రాజకీయాలు చేస్తుందని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి లోక బాపురెడ్డి మండిపడ్డారు. శనివారం కథలాపూర్ మండలం భూషణరావుపేటలో మాట్లాడారు. ఫార్ములా ఈ కేసులో విచారణకు హాజరు కావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఏసీబీ అధికారులు నోటీసులు ఇవ్వడాన్ని ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్నందుకే మాజీ మంత్రి కేటీఆర్‌కు ఏసీబీ అధికారులతో నోటీసులు ఇప్పించారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా అభివృద్ధిపై దృష్టిసారించి ప్రతిపక్షాలపై కక్షపూరిత రాజకీయాలు మానుకోవాలన్నారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి

కోరుట్ల: భూతగాదా విషయంలో ఆత్మహత్యకు యత్నించిన కోరుట్ల విశ్వ బ్రాహ్మణ సంఘం మాజీ అధ్యక్షుడు వనతడుపుల నాగేశ్వర ప్రసాద్ కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని కోరుట్ల పట్టణ విశ్వ బ్రాహ్మణ సంఘం సభ్యులు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావుకు శనివారం వినతిపత్రం సమర్పించారు. కరీంనగర్ ఆస్పత్రిలో చావుబతుకుల మధ్య ఉన్నాడని, అతడికి న్యాయం చేయాలని కోరారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలి



మంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

మెట్‌పల్లి: మంత్రిగా నియమితులైన అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను శనివారం మాజీ సర్పంచ్ కొమిరెడ్డి లింగారెడ్డితో పాటు మెట్‌పల్లికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వచ్చే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాల్లో విజయం సాధించేలా కృషి చేయాలని మంత్రి సూచించినట్లు లింగారెడ్డి పేర్కొన్నారు. ఆయన వెంట గంగోని బాలయ్య, నాగరాజు, శివ, శేఖర్‌రెడ్డి తదితరులున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న నాయకులు

కథలాపూర్: మండలంలోని చింతకుంట గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులకు శనివారం అధికారులు, నాయకులు భూమిపూజ చేశారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లబ్ధిదారులకు రూ. 5 లక్షల చొప్పున మంజూరు చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లోక నర్సారెడ్డి, గాజ ప్రభాకర్, భైర మల్లేశం, దేవయ్య, తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వ విప్‌కు వినతి

కథలాపూర్: మండలంలోని తక్కళ్లపెల్లిలో పలు అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను వేములవాడలో కలిసి వినతిపత్రం ఇచ్చినట్లు కాంగ్రెస్ నాయకులు అల్లకొండ లింగంగౌడ్, తిరుపతిరెడ్డి, సతీశ్ శనివారం తెలిపారు. తక్కళ్లపెల్లి- గుంలాపూర్ గ్రామాల మధ్య కల్వర్టు శిథిలావస్థలో ఉందని కొత్తగా నిర్మించాలని కోరారు. శ్మశానవాటిక దగ్గర బోరుబావి ఏర్పాటు చేయాలని విన్నవించగా, నిధులు మంజూరు చేస్తామని ప్రభుత్వ విప్ హామీ ఇచ్చినట్లు నాయకులు పేర్కొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

కొడిమ్యాల: మండలంలోని చెప్యాలలో మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 150 మందికి వైద్యులు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి హెడ్ గుర్రం కిరణ్, పద్మశాలీ సంఘం అధ్యక్షుడు బుచ్చిరాములు, మాజీ ఎంపీటీసీ మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ శేఖర్, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీరప్ప ఉత్సవాలు



పెగడపల్లిలో గంగబోనం ఊరేగింపు

పెగడపల్లి: గొల్ల–కురుమల ఆరాధ్య దైవం బీరప్ప దేవుని ఉత్సవాలు పెగడపల్లిలో ఘనంగా సాగుతున్నాయి. గొల్లల (యాదవ సంఘం) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా శనివారం బీరప్ప కళాకారుల వీరగంధ వేషధారణతో గంగ బోనం ఊరేగింపు జోరుగా సాగింది. ఈ సందర్భంగా బీరప్ప కళాకారులు ప్రదర్శించిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. బీరప్ప జాతర నేపథ్యంలో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. యాదవ సంఘం నాయకులు, కుల పెద్దలు పాల్గొన్నారు.



సారంగాపూర్: మండల కేంద్రంలో 16 ఏళ్ల కింద నిర్మాణం చేపట్టిన స్త్రీశక్తి భవన నిర్మాణ పనులు ఇప్పటికీ పూర్తి కాలేదు. దీంతో భవనం రోజు రోజు శిథిలావస్థకు చేరుతుంది. రూ. 20 లక్షలతో చేపట్టిన స్త్రీశక్తి భవనం నిర్మాణం పూర్తయితే మహిళా సంఘాలకు అనువుగా ఉంటుంది. భవనానికి కిటికీలు, తలుపులు, కింద ఫ్లోరింగ్, విద్యుత్ ఫిట్టింగ్‌లు, మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఇప్పటికైనా నిర్మాణం పూర్తి చేయాలని మహిళలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రాజమల్లయ్య,ఏఈ పీఆర్ సెల్: 9440036348

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

నిరుపేదలకు గూడు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం



ప్రొసీడింగ్ పత్రాలు పంపిణీ చేస్తున్న నర్సింగరావు

మల్లాపూర్: రాష్ట్రంలోని ఇళ్లు లేని పేదలకు గూడు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సహకార కార్పొరేషన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, అన్నారు. మండల కేంద్రంలోని కేఎంఆర్ గార్డెన్స్‌లో శనివారం లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవారి ఆత్మగౌరవానికి ప్రతీక ఇందిరమ్మ ఇళ్లు అన్నారు. పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి, మాజీ ఎంపీపీ నల్ల రాజన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ అంతడపుల పుష్పలత నర్సయ్య, వైస్ చైర్మన్ ఇట్టెడి నారాయణరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పుంద్ర శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్,నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ కోరుట్ల మండల నూతన కార్యవర్గం

కోరుట్ల రూరల్: బీజేపీ కోరుట్ల మండల నూతన కార్యవర్గాన్ని శనివారం నియమించినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు పంచిరి విజయ్ కుమార్ తెలిపారు. ఉపాధ్యక్షులుగా ద్యావణపెల్లి భూమానందం, బండ వంశీ, నక్కిరెడ్డి మల్లారెడ్డి, గుగ్గిళ్ల రజిత, మారంపెల్లి చంద్ర శేఖర్, ప్రధాన కార్యదర్శులుగా విఠల్ రాజేందర్ రెడ్డి, గోపు ప్రశాంత్, భూమి వినోద్, కార్యదర్శులుగా బడుగు భూమేశ్వర్, ద్యావనపెట్టి శరత్, రాజోజి సుధాకర్, కొక్కుల వెంకటేష్, సంయుక్త కార్యదర్శులుగా నల్ల సంజీవ్, తునికి ప్రశాంత్, బొల్లపెల్లి రాహుల్,చాట్ల ఆనంద్, కోశాధికారిగా మాదాడి ప్రవీణ్ తో పాటు కార్యవర్గ సభ్యులను నియమించినట్లు విజయ్ కుమార్ పేర్కొన్నారు.

▶ గ్రామాభివృద్ధి కమిటీ నియామకం

కోరుట్ల రూరల్: మండలంలోని చిన్నమెట్‌పల్లి నూతన గ్రామాభివృద్ధి కమిటీని శనివారం ఎన్నుకున్నారు.అధ్యక్షుడిగా నాగులపెల్లి జయరెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఓరుగంటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా సంగెపు అశోక్, కోశాధికారిగా కుందారపు సురేశ్, సంయుక్త కార్యదర్శిగా కంటి రాజశేఖర్, సలహాదారులుగా యండీ రహీం, గొల్లపెల్లి శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అన్ని కుల సంఘాల పెద్దలు పాల్గొన్నారు.

▶ ట్రాక్టర్ యూనియన్ అధ్యక్షుడిగా గంగాధర్

రాయికల్: మండలంలోని ఆలూరు ట్రాక్టర్ యూనియన్ అధ్యక్షుడిగా చిల్ముల గంగాధర్, ఉపాధ్యక్షుడిగా ఎద్దె సురేశ్ శనివారం ఎన్నికయ్యారు.

▶ రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు విద్యార్థులు ఎంపిక

కథలాపూర్: మండలంలోని తక్కళ్లపెల్లి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ రాజేశ్ శనివారం తెలిపారు. జగిత్యాలలో జరిగిన జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో పాఠశాలకు చెందిన నక్క వేదాక్షరి, తిపిరి నవిత, రామ్‌చరణ్ అనే విద్యార్థులు ప్రతిభ చాటారన్నారు. వీరిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్‌ఎం రవీందర్, ఉపాధ్యాయులు అభినందించారు.

▶ ఉరేసుకుని విద్యార్థిని ఆత్మహత్య

మల్యాల: మండలంలోని నూకపల్లికి చెందిన బాలిక ఉరేసుకుంది. ఎస్సై నరేశ్‌కుమార్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కోరెం లక్ష్మీనారాయణకు నలుగురు కూతుళ్లు. మూడో కూతురు గౌతమి (14) కరీంనగర్‌లోని సోషల్ వెల్ఫేర్ గురుకులంలో 8వ తరగతి చదువుతోంది. ఆమె కొంతకాలంగా గొంతునొప్పితో బాధపడుతోంది. జీవితంపై విరక్తి చెంది ఈనెల 13న రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో వంట గదిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

▶ బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

మల్లాపూర్: విద్యుత్ షాక్‌తో మృతి చెందిన మాదం నాగరాజుయాదవ్ కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకుంటామని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి దనరేకుల సంతోష్‌యాదవ్ అన్నారు. మండలంలోని గొర్రెపల్లిలో శనివారం బాధిత కుటుంబాన్ని మండల అధ్యక్షుడు సంగ గంగరాజంతో కలిసి పరామర్శించారు. మృతుడి కుమార్తెలకు రూ.75 వేల చొప్పున డిపాజిట్ చేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు రాజగంగరాం, అంజయ్య, ప్రవీణ్, నర్సయ్య, రాజేందర్, రాజం, మల్లేష్, పాల్గొన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

మల్లాపూర్: మండల కేంద్రంలోని ఎస్టీ మినీ గురుకుల బాలికల పాఠశాలలో ఖాళీలుగా ఉన్న బోధనేతర సిబ్బంది పోస్టులకు అవుట్ సోర్సింగ్ పద్ధతిలో నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీప్రియాంక శనివారం తెలిపారు. కుక్, కిచెన్ హెల్పర్, ఆయా, వాచ్‌మెన్ పోస్టులకు పదో తరగతి పాస్ అయిన స్థానిక గిరిజన మహిళ అభ్యర్థులు బయోడేటాతో ఈ నెల 20 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కొడిమ్యాల: మండలంలోని పూడూరు వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహంలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంక్షేమ అభివృద్ధి అధికారి సునీత, వసతి గృహం సంక్షేమాధికారి పూర్ణచందర్‌రెడ్డి శనివారం తెలిపారు. 3 నుంచి 10వ తరగతి బాలురు అర్హులని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 8978710711 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

▶ క్రీడా పాఠశాలలో ప్రవేశానికి..

బుగ్గారం : మండలంలో 4వ తరగతి చదివే విద్యార్థులకు క్రీడా పాఠశాలలో ఎంపికకు దరఖాస్తులు కోరుతున్నట్లు మండల విద్యాధికారి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ నెల 19న జెడ్పీ హైస్కూల్ బుగ్గారంలో, తర్వాత జగిత్యాల జిల్లా కేంద్రంలో ఎంపిక పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎంఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.

సారంగాపూర్: ప్రభుత్వ క్రీడా పాఠశాలలో అడ్మిషను పొందడానికి ఈ నెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలని బీర్‌పూర్ ఎంఈవో సిరుప నాగభూషణం తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి 4వ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మండలస్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయిలో ఈ నెల 16 నుంచి నిర్వహించే క్రీడా పోటీల్లో అర్హత పొందిన వారికి అడ్మిషన్లు కల్పిస్తారని పేర్కొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జగిత్యాల జిల్లా:
9951602934, 9000308905
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
జగిత్యాల: సంపత్ - 9676406002
ధర్మపురి: వెంకటేష్ - 8008019205
కోరుట్ల: సురేశ్ - 7997958210
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899